*వర్తమాన వ్యవస్థలో ప్రజ్వలించి చైతన్యం పుట్టకపోతే, రేపటి వ్యవస్థమీదనయినా నమ్మక ముంచుకోక తప్పదు!*



# రేపటి వ్యవస్థ

## పాయసం సుబ్రహ్మణ్యం

రెక్కలు వచ్చిన పావురం గూటిలోనుంచి తొంగి చూసింది.

"అబ్బ! బయట యెంత వెలుగుంది" అనుకొంది. చీకటి జీవితానికి అల వాటుపడ్డ పావురం ఒక్కసారిగా వెలుగును చూసింది. క్రమక్రమంగా వెలుగును తనలో నింపుకోవాలని ఆరాటపడింది. ఆ ఆరాటమే చైతన్యానికి నాంది. అంతే! అంతవరకూ మస్తిష్కంలో నిండిన చీకటి తొలిగిపోతుంది.

నారిగాడికి తెలుసుకోవాలనే జిజ్ఞాస ఎక్కువ. చదవడం నేర్చుకొన్న తరువాత పూర్తిగా పుస్తకాల పురుగై పోయాడు. ఆ పుస్తకాలలోనే తనలో పుడుతున్న ప్రశ్నలకు సమాధానాలనువెతుక్కున్నాడు శంకరంబాబు నారిగాడికి వంచిన హేతువాద విజ్ఞానం నారిని మానసికంగా మరింత పెంచింది. వెలిగినజ్యోతి, వేయి జ్యోతుల్ని వెలిగిస్తుంది. కుల తత్వానికీ, ప్రాంతీయ తత్వానికీ పుట్టినిళ్ళయిన పల్లెటూళ్ళలో పల్లెప్రజల మస్తిష్కాలలో ఇలాంటి జ్యోతులే వెలగాలి.

సాయంత్రం పూట తన తోటివాళ్ళని చేర్చుకొని మతం, కులం ఎలా సృష్టించబడినదీ, దేవుడెలా పుట్టిందీ వివరంగా చెప్పేవాడు. నారిగాడి నాస్తికత్వానికి భయపడి కొందరూ, ఊరి పెద్దలకు భయపడి కొందరూ నారిగాడితో చేరడం మానేశారు. నిజమే మరి! చీకటి బ్రతుకుల్లోకి వెలుగును పంచుకోవడం కూడదనే మనస్తత్వం పెట్టుబడిదారీ వ్యవస్థలో గాఢంగా పాతుకుపోయింది. సామాన్యుడు మాన్యుడైతే తమని ఎదిరిస్తాడని, తమ వ్యవస్థను ప్రశ్నిస్తాడని వీళ్ళకు భయం. అలాంటి భయాలకు లొంగని యువతరం మాత్రం నారిగాడినుంచి ఎంతో తెలుసుకోవాలని ఉబలాటపడేది. ఈ విషయం అలా అలా పాకి గ్రామపెద్దల చెవి వరకూ పోయింది. నిజం తెలిసిన కాలనాగులుకస్సుమన్నాయి. "తనకులాన్ని గూర్చి దుమ్మెత్తిపోయడమేగాక దేవుళ్ళని నిందిస్తున్నాడనీ. దేవుళ్ళని మనిషి సృష్టించాడన్న రహస్యాన్ని నలుగురికీ చెప్పేవాడనీ" పంతులకి నారిగాడి మీద గొంతువరకూ కోపమొచ్చింది. "తరతరాలుగా

తను మోచేతి నీళ్ళు తాగుతూ అడుగులకు మడుగులొత్తడమే తప్ప తలెత్తలేని జీత గాళ్ళకు వెట్టి చాకిరీ చెయ్యడం అన్యాయ మనీ బానిసలుగా బ్రతకడంకంటె చావడం నయమనీ నూరిపోస్తున్నాడని" నారిగాడి మీద భూషణం పగబట్టాడు.

"తన మాటకు యెదురు లేకుండా బ్రతికి కనిపించిన ఆడదాన్ని బలవంతంగా లొంగ దీసుకొని మహారాజులా వెలిగిపోతున్న తనని ఆఫ్టరాల్ ఒక ఆడదాని ముందు మకెక్కిలిరుగ దన్నాడని" నారిగాడిమీద నాగరాజుకు పట్టరాని కోపంగావుంది.

నాగుపాములు పగబట్టాయి. "పట్టణం లోని నాగుపాములకు విషంవున్నా అదంత ప్రమాదకరమైనది కాదు. కానీ పల్లెలలోని నాగుపాములు బహుప్రమాదకరమైనవి. అణువణువూ విషం నింపుకొన్న వాటికి యెదురే లేదు. పల్లెలలో నాగుపాముల్ని యెదిరించిన వాడు సర్వనాశనమైపోతున్నా ప్రక్కవాడు కిక్కురుమనడు. ఫ్యూడల్ వ్యవస్థలో అలవాటువడ్డ వాటిని నాగు పాములు ఇంకావదులుకోలేదు. రాబందులు సైతం వదులుకోలేకపోతున్నాయి. ఫలి తంగా సామాన్యుడు బానిసగా తయారు చేయబడ్డాడు. యుగ యుగాలుగా బలి వంతుడి గుప్పెట్లో బ్రతుకు గడుపు తున్నాడు. సామాన్యులు అందరూ అను కొన్న విధంగా దేవుడు చేసిన బొమ్మలు కాదు. మనిషి చేసిన బొమ్మలు. సూర్యు డస్తమించబోతున్నాడు.

ఒంటరిగా వస్తోన్న పావురాన్ని నాగ జెముడు పొదలమధ్య నక్కి కూర్చున్న కిరాతకులు పైనబడి పట్టుకొన్నారు. పావురం గిజగిజలాడింది. ఎదిరించింది. గట్టిగా కేకలేసింది. ప్రయోజనం శూన్యం. చివరికి లొంగిపోక తప్పలేదు.

* * *

నారిగాడు చీకటిగదిలో స్తంభానికి కట్టి వేయబడ్డాడు. నాలుగడుగుల దూరంలో దీపపుబుడ్డి వెలుగుతోంది. ఎదురుగా నమిలేసేలా చూస్తూ ముగ్గురు వ్యక్తులు పళ్ళు కొరుకుతున్నారు. ముగ్గురి చేతు ల్లోనూ పిడిబాకులున్నాయి.

"ఏం నాయనా! నాలుగు పుస్తకాలు చదువుకొన్నంత మాత్రాన కళ్ళు నెత్తి కెక్కిపోయాయా? మా కోసం మేం శాస్త్రాలనూ, దేవుళ్ళనూ సృష్టించుకొని ప్రజలను తరతరాలుగా దోచుక తింటు న్నామా? కర్మ సిద్ధాంతాలతో దేశాన్ని పాడుచేస్తున్నామా? మనిషి భయం నుంచి దేవుడు పుట్టాడంటావా? ప్రకృతి లో ఉత్పన్నమవుతున్న భీతి విస్మయాల అగాథాలనుంచి మతం పుట్టిందా? కుల


## ఋణం

వ్యాపారాభివృద్ధికోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆ పైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోను : 395126

SUPREME CORPORATION (BANKERS)
F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory, Tardeo Road, BOMBAY-400 034

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో






SPRINGFIELD AGENCIES (Regd.)
E-32 FATEH NAGAR NEW DELHI-110018

ORDER FORM ----POST TODAY----

AJP-13

*The Manager*
*Springfield Agencies (Regd.), New Delhi-110018*
*Dear Sir,*
*Please send me One Springfield Supershot-77 Air Rifle on Rs. 20 - per month instalment alongwith all the documents for possession. As per your instalment system I agree to pay the instalments regularly.*

NAME.......................... AGE......YEARS
ADDRESS..........................................
P.O .............. PIN ☐☐☐☐☐☐ DIST...........
OCCUPATION................ SIGN...............

FILL THIS FORM IN ENGLISH IN BLOCK LETTERS
DO NOT SEND ... WITH THIS ORDER

### సంప్రదాయ మాధురి

## ముంబాత మకరందాలు

శ్లో॥ తమవేక్ష్య రురోద సా భృశం
స్తన సంబాధ మురో జఘానచ
స్వజనస్యహి దుఃఖమగ్రతో
వివృత ద్వార మివోప జాయతే॥

భర్త మరణమునకు శోకిస్తున్న రతీదేవి, వసంతుని చూసి రొమ్ము బాదుకుని యింకా యెక్కువగా యేడ్చింది. అయినవారిని చూసినప్పుడు దుఃఖం తలుపు తోసుకుని ఒక్కసారిగా ముంచెత్తినట్లు వస్తుంది.

---

విభజనచేసి దేశాన్ని నాశనంచేస్తున్నామా? అవ్వ! అవ్వ! చదువుకొంటే వున్నకాస్త మతీ పోయిందని. రహస్య విషయాలు రహస్యంగానే వుంచాలబ్బాయ్. చీకటిలో వున్న వాళ్ళని ఒక్కసారిగా వెలుగులోకి తెస్తే యేమవుతుంది? కళ్ళుపోతాయ్! ఇన్నాళ్ళకి మా వూరికి ఓ పెద్ద మొన గాడు బయల్దేరాడు." తీక్షణంగా చూస్తూ అన్నాడు పంతులు.

"అవును! నేను చెప్పిందినిజం. నువ్వు దోచుకొంటున్నావు. దేవుడూ, దెయ్యాలపేర్లు చెప్పి ప్రజల్లో పిరికిమందు నూరిపోసి వాళ్ళని యెందుకూ కొరగాకుండా చేస్తున్నావు. నరనరాల్లో నిస్తేజతను నింపుతున్నావు. మనిషికీ, మనిషికీ మధ్య భేదాలు పెంచి, మనసుకూ, మనసుకూ మధ్య అగాధాలు సృష్టించి, నీ గుప్పిట్లో మనిషిని ఆడిస్తున్నావు. ఇది తరతరాల చరిత్ర చెబుతున్న నిజం" గట్టిగా అరిచాడు నారిగాడు.

"అరవరా! అరుప్. కాలం సమీపించిన గొర్రె వెర్రిపోకడలు పోతుందట. నూకలు చెల్లినవాడు నీలాగే కారుకూతలు కూసి మట్టిగొట్టుకుపోతాడు."

"నువ్వూరుకో పంతులూ!" అని భూషణం నారిగాడి జుట్టు పట్టుకుని "ఏరా! మహా మొనగాడివి బయలుదేరి వెట్టిచాకిరీని మానిపిస్తావట్రా! జీతగాళ్ళను ఎదురు తిరగమని చెబుతావట్రా! వాళ్ళను నేనివాళ మెడపట్టి గెంటేస్తే పిడికెడు మెతుకులు కూడా దొరకవురా. నన్ను కాదని వాళ్ళు కాదుకదా ఆఖరికి నువ్వు కూడా బతకలేవు. పులిని ఎదిరించిన కుందేళ్ళు ఏమైపోతాయో తెలీదులా వుంది పాపం నీకు" విసురుగా చెంపమీద కొట్టాడు భూషణం.

"ఇంత కాలం బానిసలుగా బ్రతికిన ప్రజలు ఇంకా బానిసలుగా బ్రతికితే నీకానందంగా వుంటుందా! బలవంతంగా వంచబడిన శిరస్సులు శిఖరాల్లా తలలెత్తితే నువ్వు సహించలేవా? సాటి మనిషిని గౌరవించలేని ఏ వ్యవస్థయినా బాగుపడదు. ప్రజలెప్పుడూ నువ్వనుకొన్నంత అమాయకులు కారు భూషణం! హింసలు భరించి భరించి ఒక్కసారిగా ఎదురు తిరుగుతారు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం."నోట్లోనుంచి కారుతున్న రక్తాన్ని తుడుచుకొన్నాడు నారి.

"నోర్ముయ్! మరొక మాట మాట్లాడావంటే ఒళ్ళు చీరేస్తాను" కోపంతో ఊగిపోయాడు భూషణం.

"నువ్వూరుకో భూషణం! ఏరా! ఆఫ్టరాల్ ఆడదాని ముందు నన్నవమానిస్తావా? ఎన్ని గుండెల్రా నీకు? పరస్త్రీని తల్లిలా చూడాలా? అనుభవించడం చేతకాని ప్రతి వెధవా ఇదే మాట చెబుతాడు! బ్రతుక్కి వెరైటీ కావాల్రా! నలుగుర్లో నన్నవమానించడం కాదురా! ఇప్పుడు నోరు తెరువు చూద్దాం. వెధవన్నర వెధవా! మమ్మల్ని ఎదిరించి బ్రతికి బయటపడదామనే? ఊఁ నీ దైవాన్ని తలుచుకో" పిడి బాకును పైకెత్తుతూ అన్నాడు నాగరాజు.

"ఓరీ పిచ్చిసన్నాసీ! వాడు దేవుడు లేడు మొర్రో అంటుంటే వాడిని దేవుడిని తల్చుకోమంటా వేమిటయ్యా!" వ్యంగ్యంగా అన్నాడు పంతులు

"అంటాడంటావు గుండెల్లో పాక పోటు పొడిస్తే దేవుడూ అనడూ?" అపహసించాడు నాగరాజు.

"ఛీ! మీరూ మనుషులేనా? ఒంటరివాణ్ని చేసి కుక్కల్లా మొరగక పోతే దమ్ముంటే కట్లు విప్పండి" హూంకరించాడు నారిగాడు.

"జనాన్ని మాపైకి ఎగదోలే నీకు కట్లు విప్పుతామట్రా! ఇప్పుడు నిన్నెవడాదుకుంటాడో అదీ చూస్తాను. ఊఁ కానివ్వండి" అరిచాడు భూషణం.

మూడు పిడిబాకులు నారిగాడి గుండెలోకి ముమ్మారు దిగబడ్డాయి. రక్తం చిమ్మింది. నారిగాడి ముఖంలో మార్పు రాలేదు. చూపులు తీక్షణంగా వున్నాయి. రక్తంతో తడిసి ఎర్రటి సూర్యుడిలా జ్వలిస్తున్న నారిగాడిని చూడలేక భయంతో ముగ్గురూ కళ్ళు మూసుకున్నారు.

కిరాతకుల కత్తులకు బలైపోయిన పావురం తల వాల్చేసింది.

* * *

"నిప్పులాంటి నిజాన్ని చెప్పినవాడు వ్యక్తి చైతన్యానికీ, తద్వారా మార్పుకూ నాందీ పలుకుతాడనీ, తమ ఆధిపత్యాన్నీ, అంతస్తునీ, మంటగలిపిసామాన్యులరక్తం పిండి తాము కట్టుకొన్నరమ్యహర్మ్యాలను పునాదులతో సైతం పెకలించి తమ ఉనికికే సమాధి కడతాడనీ, ఈ వ్యవస్థను గుప్పిట్లో వుంచుకొన్న వాళ్ళ భయం. అందుకే అలాంటి వాళ్ళని తరతరాలుగా చిల్లర దేవుళ్ళ వ్యవస్థ బలితీసుకొంటోంది. చైతన్యంలేని ప్రజలు యివేమీ పట్టించుకోక హాయిగా నిదురపోతున్నారు. మరయంత్రాల్లా జీవిస్తున్నారు చీకట్లను తొలగించుకొని లోకాన్ని వెలుగుమయం చేస్తున్న వ్యక్తిని భూషణం, పంతులు, నాగరాజులాంటి వ్యక్తులు అంతం చేస్తారని నారిగాడికి తెలిసీ యెదురు తిరిగాడు. ఫలితం నిస్సహాయంగా బలైపోయాడు కానీ, ఈ దారుణానికి అంతం యెప్పుడు? ప్రజలు చైతన్యవంతులయ్యేదెప్పుడు? సామాన్యుడికి నిజమైన రక్షణ లభించేదెప్పుడు? ఇవన్నీ ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు సమాధానం రేపటి జనం నుంచి రావాలి.

అదెలా సాధ్యం?

ప్రభావితుడై చైతన్యాన్ని పుంజుకొన్న వ్యక్తి పంచే వెలుగుల్ని జీర్ణించుకొనేశక్తి మన వ్యవస్థకు కలగాలి. అప్పుడు ఈ ప్రశ్నలకు సమాధానం ఆ వ్యవస్థే యిస్తుంది. ఓర్పు నశించి తీర్పుకు సమాధానం లభిస్తుంది.

"అదే రేపటి వ్యవస్థ!" ★